
**ఉదయం యెండ చాలా చురుగ్గా వుంది. రాత్రి కురిసిన వాన నీళ్ళు నిలిచిన చోటుల్లో యెండపడి మెరుస్తుంటే గుమ్మంవద్దే నుంచుని రోడ్డువైపు చూస్తున్నాడు ఆనందరావు.**

"మీకు కాలేజీ టైం కావటంలేదా అట్లా నుంచున్నారు" అని శాంత కేక లోపల్నుంచి వినిపించినా వినిపించనట్లే నుంచున్నాడు. లేచినప్పటి నుంచి చికాగ్గానే వుంది ఆనందరావుకి. పాలవాడితో గొడవతో మనసంతా వికలమైంది.

# త్రిశంకు స్వర్గం

## కె.ఎస్.రమణ



వీధి కుళాయిలో నీళ్ళు ఆగిపోయినట్లున్నాయి. తమవంతు నీళ్ళురాని ఆడవాళ్ళంతా బిగ్గరగా అరుచుకుంటూ విసురుగా బిందెలు తీసుకుని వెళుతున్నారు.

ఆనందరావుకి బద్ధకంగా వున్నట్లనిపించింది. సెలవుపెడితే బావుణ్ననుకున్నాడు. పెళ్ళయిన కొత్తలో కొన్నిరోజులు వీలు చిక్కినప్పుడల్లా సెలవు పెట్టి యింట్లో గడపటం సరదాగానే వుండేది. కాని యిప్పుడు భయం వేస్తుంది.

శాంతకు కోపం యెక్కువ. ఏవో తను కలలు కన్నట్లు తన సంపాదన లేకపోవటం, యింటికి ఆమె తెచ్చుకున్నవి తప్ప ఫ్రిజ్, బీరువా లాంటివి కొని అమర్చుకోవాలన్న చిన్న కోరికలు పెళ్ళయి సంవత్సరం కావస్తున్నా తీరకపోవడం అసంతృప్తి కలిగించి వుంటుంది. పాపం లేకుంటే శాంత మంచిదే. ప్చ్... యింతకీ తను కట్నం లేకుండా పెళ్ళి చేసుకుని వుండాల్సింది. తలిదండ్రులూ, పరిస్థితులూ తన మెడని వంచేశాయి. తన ఆదర్శాలను నేలరాచి వేశాయి. వాళ్ళు బేరాలాడుకుంటే నిస్సహాయంగా వూరుకుండిపోయాడు. "ఆ డబ్బులు ఏవి! ఏం చేశావు! అంటుంది శాంత. తనకీ తెలుసు ఏం చేశాడో. కాని, అడగట మెందుకో! వాటివార అప్పులు తీర్చేసి తలిదండ్రులకి గ్రామంలోవున్న ఇల్లు మిగిలించేసరికి తనకు కొంత వూపిరి పీల్చుకున్నట్లయింది. కాని, లోపల యేదో అసంతృప్తి- అప్పుడప్పుడూ అంతరంగంలో రాజుకునే అగ్ని.

లోపలికి వచ్చాడు ఆనందరావు. పేపరు తీసుకుని ఓసారి హెడ్‌లైన్స్ చదివి అవతలికి విసిరేసి షేవింగ్ చేసుకోటానికి పరికరాలను సమకూర్చుకోసాగాడు.

"లోపలికోసారివొచ్చి కాఫీతాగి వెళ్ళండి యివతల పొయ్యిమీద నాకు పనుంది."

శాంత కేక విని విసుగ్గా లేచివెళ్ళాడు. కాఫీ వొక్క గుక్కలో తాగటానికి ప్రయత్నించి కషాయంలాగా అడ్డుపడటంతో మొహం వికారంగా పెట్టాడు.

"చక్కెర లేదండీ అంటే వినిపించుకున్నారు కాదు. మనకా కోటా చాలదు

బ్లాక్‌లో తెండి అంటే మీకు నామోషీ. పోనీ మీ వొద్ద వూరికే చదువు చెప్పించుకోటానికి వొచ్చే కుర్రాళ్ళకైనా పురమాయిద్దామనుకుంటే మీకు కోపం వొస్తుంది. ఎట్లా చావటమో ఈ పనులతో" మాటలు ఆపి వోసారి కొంగుతో మొహం తుడుచుకుంది శాంత.

"చూడు శాంతా- నాకు కొన్ని 'ప్రిన్సిపుల్స్' వున్నాయి. వాటిని చంపుకుని జీవించలేను. నువ్వు మాటిమాటికీ యిలా చిన్న విషయాలమీద రాద్ధాంతం లేవదీస్తే నా మనసు చాలా బాధపడుతుంది. సర్దుకుపోవడం నేర్చుకోవాలి" అన్నాడు ఆనందరావు కొంత చిరాకుగా.


"అదే మీరూ నేర్చుకోవాలీ అంటున్నాను. మీ చుట్టూ వోసారి చూసి నేర్చుకోండి. ఎవరూ మీలాగా మడి గట్టుకుని కూర్చోటంలేదు. ట్యూషన్లు చెప్పుకొంటూ, పై సంపాదనలతో దర్జాగా బతుకుతున్నారు. నాకిదేం ఖర్మండీ ? ఎవరైనా వొచ్చి చూస్తే నవ్విపోతారు. ఇంత కట్నంతో కలవారింటి నుంచి వొచ్చీ ఈ పత్యపు బతుకు బతుకుతున్నానంటే. అసలు మిమ్మల్నొకటి అడగాలనుకుంటున్నాను. ఏమిటి మీ వుద్దేశ్యం— నిన్న మా తమ్ముడు కాలేజీ సీటుకి వొస్తే సిఫారసు చెయ్యకపోయారు సరే. డొనేషన్ కట్టాలంటే ఆ బేరాలేవో నువ్వే చూసుకో లేదా మీ నాన్నను రప్పించుకో అంటారా— ఆ కాలేజీ లెక్చరర్ అయ్యుంకీ ప్రిన్సిపాల్‌తో వొక్కమాట చెప్పలేకపోయారా— డొనేషన్ యెంతైనా కట్టుతాం సీట్ ఇప్పించండి అని. అసలే కలికాలం-బిల్డింగులకనీ వాటికనీ వీటికనీ గవర్నమెంట్, కాలేజీవాళ్లు కూడా ముక్కుపిండి డబ్బులువసూలుచేస్తుంటే ఏమనుకోవాలి ? అసలు మీకీ పోస్టైలా వచ్చింది? ఎంత రికమెండేషన్లతో, లంచాలతో వొచ్చిందీమర్చిపోయారా? అంతా మా నాన్నగారు చేసిపెడితే సరిపోయింది. ఇదిగో నేనిట్లా యేదన్నా వున్నది అంటే మండిపడతారు "ముక్కు యెగబీల్చి ఆనందరావు వేపు చూసింది. ఆ చూపులో జాలి వుంది. కోపం వుంది. తల్లి జనసమ్మర్దంలో నడవటం చేతకాక వొదిగి వొదిగి బిక్కుబిక్కుమంటూన్న పిల్లవాడికేసి చూసినట్లుంది-ఆ చూపు.

ఆనందరావు మొహంలో విసుగులేదు. కోపంలేదు. విచిత్రమైన నవ్వు పెదవులపై మెరిసింది. శాంత వింతగా చూసిందతన్ని. కాఫీగ్లాసు అక్కడ చప్పుడు కాకుండా పెట్టేసి నెమ్మదిగా వంటింటి గుమ్మం దాటాడు. దాటుతుంటే శాంత వొదిలిన నిట్టూర్పు సవ్వడి వెనకనుంచి వినిపించక పోలేదు అతనికి.

ఇదేదో తనెరుగని జీవితంలోకి వచ్చి పడ్డట్లుంది. ఇంత సంక్లిష్టంగా అడుగడుగునా ఆత్మను చంపుకుంటూ, మోసపుచ్చుకుంటూ, మోసపుచ్చుతూ యిట్లాగే బతుకంతా గడపాలనే ఆలోచన వొచ్చేసరికి వొణుకు పుట్టిందతనికి. రేజరుకి బ్లేడు బిగించి మరేమీ ఆలోచించకుండా అద్దం ముందు కూర్చున్నాడు ఆనందరావు.

అద్దంలో ఎరుపు కనిపించి ఉలిక్కిపడ్డాడు. తెగింది. కొత్త బ్లేడు.... బాధగా వొత్తుకున్నాడు.

'సిందూరం, రక్తచందనం
బంధూకం, సంధ్యారాగం
పులిచంపిన లేడినెత్తురూ
ఎగరేసిన ఎర్రని జెండా.'





హఠాత్తుగా మనసులోకి వొచ్చిన కవిత్వ పాదాలు కాలేజీరోజుల జ్ఞాపకాల అరని కదిలించేయి. అప్పట్లో తను లిటరేచర్‌లో ఫస్టుగా వుండేవాడు. కవిత్వం అంటే చాలా యిష్టంగా వుండేది. చిన్న చిన్న సాహిత్య సమావేశాలని ఏర్పాటు చేయటం, పాల్గొనటం లాంటివి చేసేవాడు. తనంటే అభిమానం చూపే లలిత గుర్తొచ్చింది. తనూ తన చదువుతప్ప మరేవీ యెక్కువగా పట్టించుకునేవాడు కాదప్పుడు. తను యిప్పుడెక్కడుందో ! ఇప్పుడూ అంతే. ఈ మధ్య మళ్ళీ పుస్తక పఠనంలో సీరియస్‌గా మునిగిపోయాడు. అసలు అవి లేకపోతే తను యింత మాత్రమైనా వోర్పుతో, స్థిరత్వంతో వుండేవాడు కాదేమో. ఎక్కడో ఆ మరో ప్రపంచం-ఎప్పటికో ఆ మరో ప్రపంచం-ఏమో తను కళ్ళు మూసింతర్వాతనా-ప్రతివ్యక్తి సమానావకాశాలతో సంపూర్ణంగా వికసించే రోజు ఎప్పుడో- "నిజంగానే-నిజంగానే-నిఖిలలోకం హసిస్తుందా?"

"వేడి వీళ్ళు కాగి ఆవిరై చల్లబడిపోతోంది. అద్దం ముందు అంతసేపు ఏమిటండీ. అయ్యో తెగినట్లుందే. మరో ధ్యాస లేకుండా చేసుకుంటే సరి మీ పరధ్యానవూ మీరూనూ"అని వొంగి పరిశీలనగా చూసింది శాంత. ఎర్రటి చిన్న చారని వేలితో వొత్తింది. అప్పుడే స్నానం చేసిందేమో-వొంటి పరిమళం మత్తుగా పీల్చి కళ్ళు మూసుకుని మెల్లిగా తెరిచాడు ఆనందరావు.

కళ్ళలోకి కొంటెగా చూసి "లేవండిక చాలు" అంది శాంత. ఆనందరావు లేచి శాంత దగ్గరగా నిలబడి మళ్ళీ గిరుక్కున వెనక్కు తిరిగి బాత్‌రూమ్‌లోకి దూరిపోయాడు.

* * *

సైకిల్ స్టాండ్ తీసి శాంతకు చెయ్యి వూపి నెమ్మదిగా యెక్కాడు ఆనందరావు. ఈ సైకిలూ మామగారు కొనిచ్చిందే మొదటి దీపావళి అని- మళ్ళీ అతని ఆలోచనలు చుట్టుముట్టాయి. తన బతుకు పూర్తిగా పరహస్తగతం అయిపోయింది. తను పూర్తిగా అమ్ముడుపోయాడు ఇవ్వాళ యెంత మాటంది శాంత. ఎంత సరిపెట్టుకుందామనుకున్నా బుర్రలో తొలుస్తూనే వుంది. ఆనందరావుని మళ్ళీ అశక్తత ఆవహించింది. కొన్ని రోజులుగా మరీ అశక్తంగా ఎందుకో వొంటరిగా ఫీల్ అవుతున్నాడు. తనే అపరాధం చేసినట్లు దాన్ని కొనసాగిస్తూనే వున్నట్లు అనిపిస్తోంది





ఆనందరావుకి. కాలేజీలో పాఠాలు చెబుతున్నంతసేపూ. పిల్లలతో మాట్లాడుతున్నంతసేపూ పుస్తకాలు చదువుకుంటూ చదివినదాని గురించి ఆలోచిస్తున్నంతసేపూ తప్ప మిగిలిన సమయమంతా యిటువంటి భావనలే వెంటాడుతూంటే సతమతమవుతున్నాడీమధ్య.

రోడ్డుమీద అడ్డా ఎదో గుంపు వుండటంతో సైకిల్ ( తప్పలేదు ఆనందరావుకి. నల్లటి ఆబోతులాంటి కారు. దాని ముందు భాగంలో రిమ్మలు వొంగి రూపం మారిపోయిన సైకిల్—మోచేతులపైన దెబ్బలని చూసుకుంటూ వెక్కి-ళ్ళు పడుతున్న కుర్రాడు—రకరకాలుగా వ్యాఖ్యానిస్తూ నిలబడ్డ గుంపు- ఆనందరావుకి కనిపించిన దృశ్యం అది.

ఇంతలో కూడలినుంచి వొస్తూన్న పోలీసును చూసి గుంపు చీలి దారి యివ్వటం జరిగింది. పోలీసు వోసారి సైకిలువంక, కుర్రాడివంక చూశాడు. జనంపక్క- తిరిగి వోసారి టోపీ సర్దుకున్నాడు. కారులోకి తొంగిచూశాడు. మొదట స్టీరింగ్ పట్టుకున్న చేతికున్న మంద్రగబ్బలాంటి పెద్ద ఫారిన్ వాచీని చూశాడు. వెనక్కి- చేరగిలబడివున్న భారీ ఆకారానికేసి చూసి వులిక్కి-పడి సర్దుకుని "నమస్కా-రం సార్. మీరు వెళ్ళండి సార్—నేను చూసుకుంటాను." అని గుంపుని వెనక్కి- తోస్తూ తనే సైకిల్ని అడ్డు తొలగించాడు. అందరూ నిరుత్తరులై చూస్తుండగానే కారు వెళ్ళిపోయింది. గుంపు మెల్లగా జారుకోసాగింది. పోలీసు కుర్రాడివంక చూసి "వేలెడంత లేవు చూసుకుని వెళ్ళొద్దూ ట్రాఫిక్‌లో" అని అటూ యిటూ చూసి టోపీ సర్దుకుని తన స్థానానికి వెళ్ళిపోయాడు.

ఆనందరావుకి జాలివేసింది. పోలీసుమీద కోపం వొచ్చింది. నోరుతెరవకుండా జారుకున్న గుంపుమీద కోపం వొచ్చింది. వారిలో వొకడైనందుకు తనమీదా కోపంవొచ్చింది. ఆ కుర్రాడి వద్దకొచ్చి భుజంతట్టాడు. అతన్ని గుర్తుపట్టాడు. తన వీధిలో వుంటున్న అబ్బాయే. పంతులమ్మకొడుకు. అసలే బడుగు సంసారం. పేపర్లూ అవీ అమ్ముతూ. పడుతూలేస్తూ చదువు సాగిస్తున్నాడా అబ్బాయి. వాడిచేతిలో ఐదు రూపాయల నోటువుంచి "రిపేరు చేయించి తీసుకుపో. ఆ గాయాలకు మందు వేయించు" అని చెప్పి సైకిలెక్కా-డు. న్యాయం చట్టం నీతి అన్నీ పాక్షికమైనవే. ఏది న్యాయం- బలవంతునిదే. బలవంతుదెవరు? డబ్బులున్నవాడే. పట్టపగలు హత్య చేసి కూడా స్వేచ్ఛగా, గౌరవంగా, దర్జాగా చట్టం నుంచి తప్పించుకోగలడు ధనవంతుడు దోపిడీ చేసేవారికి రక్షణ యిచ్చేందుకే యీ న్యాయస్థానాలూ, రక్షక భటులూ..ఇలా ఆలోచనల్తోనే ఆనందరావు కాలేజీ చేరుకున్నాడు.

అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఒకటే గోలగా వుంది. క్లాసులు అన్నీ "కాన్సిల్" అయ్యాయి. లెక్చరర్లు కొందరు పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. కొందరు తమతమ కాండిడేట్లను తీసుకుని ఆఫీసులోకీ బయటకీ హడావిడిగా తిరిగేస్తున్నారు. నిలబడి చర్చిస్తున్నారు. మెల్లిగా తన సీట్‌వద్దకి వొచ్చి కూచున్నాడు. ఆనందరావు ఎక్కు-వగా వారితో కలవడు. మొదట్లో అందరూ అతని గురించి రకరకాలుగా అనుకున్నా బాధపడ్డాడు. కానీ వారితో కలవటం అసాధ్యమనిపించి అంటీ అంటనట్లు వారిమధ్యే గడపటం అలవాటు చేసుకున్నాడు. పదిమందిలో వొంటరితనం అంటే ఏమిటో ఆనందరావుకి బాగా తెలిసివచ్చింది కొద్దినెలల్లోనే. ఇంతలో వో లెక్చరరు తనకోసం ఎవరో వొచ్చారని చెప్పడం విని ఆనందరావు లేచి బయటికి వొచ్చి అంజిని చూసి ఆశ్చర్యపోయాడు. అంజి తన గ్రామంలో బక్క- రైతు. సొంత భూమిని పోగొట్టుకుని, తమ పొలం కౌలుకు తీసుకుని చెయ్యటం, తరువాత తన చదువుకి పొలం అమ్మేసిన తరువాత కూలీగా మారిపోవటం కూడా తనకు తెలుసు. వాడి కొడుకేమో కాకీప్యాంటు, దానిమీద ముతక షర్టూ వేసుకుని కళ్ళు మరీ విప్పార్చి చూస్తున్నాడు. ఒక్క- క్షణంలో వాళ్ళెందుకొచ్చారో అర్థమైంది ఆనందరావుకి.



"డబ్బులు కట్టమన్నారు బాబూ. మాలాంటి వారికాడ యేముంటుంది– మీరైనా చెప్పండి. మీ మీద ఆశతో వొచ్చినాం" అన్నాడు అంజి.

ఆనందరావు ఏదో నిశ్చయం తీసుకున్న వాడిలా కుర్రాడిని తీసుకుని ప్రిన్సిపాల్ గదిలోకి వెళ్ళాడు. పది నిమిషాల తర్వాత వెలుపలి కొచ్చాడు.

"లాభంలేదు అంజీ. ప్రిన్సిపాల్ వొప్పుకోవడంలేదు. ఎలాగైనా ప్రయత్నించు. ఎక్కడైనా అప్పు పుట్టించుకుని రా. లేకుంటే సీటు రాదు. కుర్రాడికి వొక సంవత్సరం వృధా అవుతుంది."

అంజి కళ్ళలోకి చూడలేక ఈ మాటలన్న వెంటనే లోపలి కెళ్ళిపోయి తన కుర్చీలో కూలబడ్డాడు. తను ఎంత సర్ది చెప్పినా వినిపించుకోలేదు ప్రిన్సిపాల్. "కొంతమంది బీదవారికి ఆ మాత్రం అవకాశం యిస్తే ఏంకాదు. ఇకా డబ్బు మూలుగుతున్న వారినుంచి ఎంక్షువ వసూలు చెయ్యండి మీరు. లేనివాళ్ళ దగ్గర ఎందుకు అలా పట్టుపడతారు" అన్నమాటలకి ప్రిన్సిపాల్ సమాధానం అతన్ని వొక్క–క్షణం అక్కడ మరి నిలవనీలేదు. "నీకు తెలీదు యింకా కుర్రాడివి. ఈ విషయాల్లో జోక్యం చేసుకోకు" అని చిన పిల్లాడిని గదమాయించినట్లు అనేసరికి తనకు తలకొట్టేసినట్లయింది. ఆ కుర్రవాడి మొహంలోకి కూడా చూడలేకపోయాడు మళ్ళీ. ఆనందరావుకి తలనొప్పి ప్రారంభమైంది. మధ్యాహ్నం అయింది. కారియర్‌లోంచి టిఫిన్ తీసి తినాలనిపించలేదు. ఇది నరకం. తను ఇట్లాగే జీవించాలి. ఇంకా యిట్లాంటివెన్నో సంఘటనలని యెదుర్కొంటూ. ఏమి యెరగనట్లు ఏమీ జరగనట్లు పట్టించుకోకుండా ఏ ఉద్రేకానికీ లోనుకాకుండా యంత్రంలా పనిముట్టులా బతకాలి అనుకున్నాడు ఆనందరావు.

* * *

సాయంత్రం మబ్బులు తెల్లటి కురుపు మీద ఈగల్లా ఆకాశంలో ముసురుకున్నాయి. వొరుసుకున్నాయి. శబ్దాలు చేశాయి. మెరిశాయి. కొంత సేపట్లోనే కుండపోతగా వాన ప్రారంభమైంది. మెల్లిగా చీకటి నల్లదుప్పటిలా పరచుకుంది.

కొద్దిగా వాన తగ్గుముఖం పట్టేసరికే ఏడు గంటలయింది. ఇంటికి బయలుదేరాడు ఆనందరావు. తన్ను పేరు పెట్టి ఎవరో పిలిచినట్లుండటంతో వెనుదిరిగి చూశాడు. కొద్దిగా మాసిన గడ్డంతో సత్యం. ఆశ్చర్యంతో సైకిల్ దిగాడు.

"మొన్ననే విడుదలయ్యాను. నిన్ను చూడాలని బయలుదేరాను సాయంత్రం. కానీ కాలేజీ చేరేలోపలే వర్షం రావటంతో.. సరేకానీ పద యెక్కడైనా కూచుని మాట్లాడుకుందాం" అన్నాడు గుక్క తిప్పుకోకుండా.

ఆశ్చర్యం నుంచి తేరుకుంటున్న ఆనందరావు సత్యం భుజంమీద చెయ్యి వేసి నొక్కాడు ఆప్యాయంగా. ఇద్దరూ నడవటం సాగించారు. కొద్ది దూరంపోగానే కనిపించిన బార్‌లోకి నడిచాడు సత్యం– ఆనందరావుకి మాట్లాడే అవకాశం యివ్వకుండానే. మౌనంగా సత్యాన్ని అనుసరించక తప్పలేదు ఆనందరావుకి.

వెలుతురు కొద్దిగా పడుతోంది. వారు కూర్చున్న టేబిల్‌పైకి. సత్యం రమ్ ఆర్డరు చేశాడు. తనని ప్రశ్నార్థకంగా చూసిన సత్యంకేసి సమ్మతి పూర్వకంగా చిరునవ్వు నవ్వాడు ఆనందరావు.

"ఇక చెప్పరా– ఏం చేస్తున్నావు" అడిగాడు సత్యం. ఆనందరావు తన పెళ్ళి గురించీ. ఉద్యోగం గురించీ చెప్పాడు.


సత్యం తను జైలులో వుండగానే అమ్మా నాన్నలు చనిపోయారనీ తనని రాజకీయాల్లో అక్రమంగా యిరికించి హత్యకేసుమోపి జైలుకు పంపిన వారిమీద ప్రతీకారం తీర్చుకునేందుకే మళ్ళీ గ్రామంలోకి వొచ్చానని చెప్పాడు వుద్రేకంగా.

సత్యం తిరుగుబాటుదారుగా ముద్రపడి రాజకీయాల దుష్టశక్తులకు బలైపోయాడని మాత్రం తెలుసు ఆనందరావుకి. అతన్ని

## మకర సం/క్రాంతి

"ఆకుపచ్చ కోకకాను
అందమైన గాజులు తే"
ఊకబంతి చెట్టైఉ
గ్రూతలూగె నింటావిడ ।।
"ఇంత చదువుకున్న వాడి
కిట్టి నూలు దుస్తులా ।।"
ఇంట గంగిరెద్దై కొడు
కింగిత మెరుగక గెంతెను.
"మీరిచ్చిన కట్నము నా
దారి కర్చుకే చాలదు ।"
పగటి వేషగాడైనా
పరువుతీసె కొత్తల్లుడు
"ఎవ్వడబ్బ సొమ్మిదిరా
నువ్వు వెచ్చబెడుతున్నావ్।।"
ముసలి తండ్రి హరిదాసై
మూల్గుచు కీర్తన పాడెను
"పిండి వంట లెందుకులే
రెండు మెతుకులెయ్యి చాలు"
భిక్షుకయై ముసలి అమ్మ
లక్షమార్లు వేధించెను ।
"వీరందరి కోరికలకు
కారణమును నేనేనా ?"
మకర సంక్రమణమైనా
మదిజ్ఞానోదయ మయ్యెను

—పాయల సత్యనారాయణ



మళ్ళీ చూడగలుగుతా ననుకోలేదు. సత్యం మళ్ళీ కనిపించటం గొప్ప సంతోషా న్నిచ్చింది అతనికి. ఉదయంనుంచీవున్న అసంతృప్తి. వేదనా. బరువూ తగ్గి కొంత తేలిగ్గా వున్నట్లు అనిపించింది.

ఇద్దరూ తాగటం ప్రారంభించారు. సత్యం తను జైలులో పడిన బాధలూ, ఆ బాధల మధ్యే విరిసిన నవ్వులూ వర్ణించి చెబుతుంటే వింటూ వున్నాడు ఆనందరావు. చాలారోజుల తర్వాత హాయిగా. స్వేచ్ఛగా వూపిరిపీల్చుకుంటూన్నట్లనిపించింది ఆనందరావుకి.

"చివరికి నువ్వు ఈ అధికార యంత్రాంగంలో బానిస చదువులు చెప్పే నౌకరువి అయ్యావన్నమాట" అన్నాడు సత్యం.

"అందుకు నేను చెల్లించిన మూల్యం ఏమిటో తెలుసా సత్యం నీకు. పైకి కనిపించే యీామే అను జీవితం విచ్చిచూస్తే అన్నీ పురుగులే. అవి కులకులమని తొలిచేస్తుంటే యీ కుళ్ళు బతుకు ఎందుకనిపిస్తుంది వొక్కోసారి" ఆనందరావు కంఠంలో దిగులు చోటుచేసుకోవటం గమనించాడు సత్యం. అనునయంగా భుజం తట్టాడు.

ఆనందరావుకి తను పడుతున్న అంతరంగ మథనమంతా వెళ్ళగక్కేయాలనుంది ఒక్కసారిగా. కళ్ళలోకి ఎర్రజీరలు వొచ్చాయి.

"నువ్వేమో అన్నీ కోల్పోయానని అంటున్నావు సత్యం. నిన్ను నువ్వు కోల్పోలేదు ఇంకా నీకు స్వేచ్ఛ వుంది. పోరాడే శక్తి వుంది నువ్వనుకున్నట్లు బతగ్గలవు. కాని నేను- నేను- నేననుకున్నట్లు జీవించలేను. నాకు ఉద్యోగం వుంది. భార్య వుంది. సంఘంలో గౌరవం వుంది. సమాజ చక్రంలో ఓ స్థానం వుంది. కాని అందుకు నేను చెల్లించుకున్న మూల్యం ఎంతో తెలుసా? నన్ను నేను పోగొట్టుకున్నాను సత్యం. నీతో కలిసి చదువుకున్నప్పటి ఆనందరావుకి, యిప్పటి ఆనందరావుకి పోలికే లేదు. ఈ జీవితంలో నేను అనుకున్నవి యిక చెయ్యలేను. జరుగుతున్నవి చూస్తూ వూరుకోలేను. ఈ సంఘర్షణతో నాకు పిచ్చెక్కేట్లుంది సత్యం" అంటూ గ్లాసు ఎత్తి గటగటా తాగేడు ఆనందరావు.

సత్యానికి జాలివేసింది. ఆనందరావు సున్నితత్వానికి ఆశ్చర్యం వేసింది. "నువ్వింకా అలవాటుపడలేదు ఆనందరావు. త్వరలో యిదే అలవాటయిపోతుంది. అప్పుడీ ఆలోచనలే రావు. ఇంత సున్నితంగా స్పందించనూ లేవు. అంచరూ కాకున్నా కొందరు నీలాగానే బాధపడుతారు కొత్తలో. కాని అలవాటు పడిపోతారు యీ జీవన విధానానికి ఈ నటనే హిపొక్రసీ సహజమై పోతుంది. అప్పుడు యీ సంఘర్షణ వుండదు. వేదన అంతకన్నా వుండదు. హాయిగా వుంటావు" అని ఆనందరావు మొహంలోకి పరిశీలనగా చూశాడు.

"నో—నో—వుండలేను. వుండను" ఆనందరావు మాటలు ముద్దగా వొస్తున్నాయి. తను గమనించలేదు. సీసాలో మిగిలింది కూడా ఖాళీ చేసేశాడు. నవ్వుకున్నాడు సత్యం. ఈ వైరుధ్యాల వూబిలో చిక్కుకున్న మెదడుకి పిచ్చి పట్టడం ఎంత సేపు? తాను మాత్రం తప్పించుకోగలడా యీ ఘర్షణనుంచి—కాని లొంగిపోకుండా నిలబడాలని ప్రయత్నిస్తున్నాడు.

ఆనందరావు గొణుగుతున్నాడు ఏదో అస్పష్టంగా. చుట్టూ మనుష్యులు మసకగా కనిపిస్తున్నారు ఆనందరావుకి. వున్నట్లుండి లేచి గట్టిగా బొంగురు గొంతుతో.

మనమంతా బానిసలం
గానుగలం, పీనుగులం
వెనుక దగా, ముందు దగా,
కుడియెడమల దగా, దగా.

అని వుద్రిక్తంగా అరిచాడు. దగాదగా అని మళ్ళీ మాటలు మర్చిపోయినట్లు గొణుక్కున్నాడు. సత్యం తూలిపోతున్న ఆనందరావుని పట్టుకున్నాడు. సత్యాన్ని చూసి పిచ్చినవ్వు వొకటి నవ్వి రెప్పలు బరువుగా మూతబడుతుంటే బల్లమీదకి వొరిగిపోయాడు. అంతవరకు ఈ దృశ్యాన్ని ఆశ్చర్యంగా, నిర్లిప్తంగా, వినోదంగా చూస్తున్న వారంతా మళ్ళీ తలలు తిప్పుకున్నారు. సర్దుకున్నారు.

ఆనందరావు కంట్లో నుంచి కారిన నీరు బుగ్గలమీదుగా ఏర్పరచిన చారను తుడుస్తూ సత్యం నిట్టూర్చాడు.

తననెవరో బలవంతంగా లేపటం, రిక్షా కుదుపులు, గుమ్మం తలకు కొట్టుకోవటం, కొంత ఏడుపూ, మెత్తని పరుపు స్పర్శా లీలగా గుర్తున్నాయి ఆనందరావుకి. తరువాత గాఢమైన చీకటి లాంటి నిద్రలోకి జారిపొయ్యాడు.

నూతన సంవత్సర కానుకలు '83 జనవరి విడుదల

ఆర్. సంధ్యాదేవి
పగడాల పంజరం-------12.00

కొడాలి సాంబశివరావు
మనసంటే తెలుసా నీకు? 12.00

వాసిరెడ్డి సీతాదేవి
తిరస్కృతి-------------18.00

కొండముది శ్రీరామచంద్రమూర్తి
చిరుమువ్వల మరుసవ్వడి 12.00
(ఆంధ్రప్రభ సీరియల్- జంధ్యాల దర్శకత్వంలో చలనచిత్రంగా రూపొందుతున్న నవల)

డా॥ సి. ఆనందారామం
నిశ్శబ్ద సంగీతం----------12.00

మీనా పబ్లికేషన్స్ 4-215 మునిసిపల్ హైస్కూల దగ్గర
నంద్యాల. 518501

Rajo ads.